



బుధవారం । 8 । మార్చి । 2023


వివక్ష పోవాలి




మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవిస్తున్నారా..?



మహిళగా మీరు ఎక్కువగా ఇబ్బంది పడిన అంశం..?



మీకు పూర్తి అధికారం ఉంటే... మహిళల కోసం ఏం చేస్తారు ?



మళ్లీ జన్మంటూ ఉంటే... ఎలా పుట్టాలనుకుంటారు?

- మహిళలపై హింస, నేరాలకు కఠిన శిక్షలు ఉండాలి
- మరో జన్మలోనూ ఆడపిల్లగానే పుట్టాలని ఉంది
- 'సాక్షి' సర్వేలో అభిప్రాయాలు వెల్లడించిన మహిళలు, యువతులు

ఆసిఫాబాద్‌రూరల్‌/కౌటాల: మహిళలపై ఇంటా బయట వివక్ష పోవాలని, రోజురోజుకు మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న దాడులను అరికట్టి, కఠిన శిక్షలు విధించాలని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. మంగళవారం నాలుగు అంశాలపై జిల్లాలో 'సాక్షి' సర్వే నిర్వహించింది. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలో మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమాజంలో వివక్ష, ఇబ్బందులు ఉన్నా మరో జన్మలో కూడా ఆడపిల్లగా పుట్టాలని కోరుకుంటున్నామని 70 శాతం మంది తెలిపారు.

పకడ్బందీగా చట్టాలు అమలు చేయాలి



సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. దాడులను అరికట్టాలి. స్వేచ్ఛగా, భయం లేకుండా రోడ్లపై తిరిగేలా చర్యలు తీసుకోవాలి.

– శిరీష, డిగ్రీ విద్యార్థి, మోతుగూడ

సమాజంలో మార్పు రావాలి



ఆడ పిల్లలపై ఏ మాత్రం వివక్ష చూపకుండా సమాజంలో మార్పు రావాలి. ఆడ, మగ అనే తేడా చూపొద్దు. గర్భంలోనే ఆడశిశువులను చంపే రోజులు పోవాలి. మహిళలు లేనిదే సమాజం లేదనే సత్యాన్ని తెలుసుకోవాలి.

– శకుంతల, ఆసిఫాబాద్

అన్నిచోట్లా రక్షణ కల్పించాలి



పనిచేసే చోట, చదువుకునే చోట ఆడపిల్లలు వివక్ష, అవమానాలకు గురవుతున్నారు. నిత్యం వారిపై హింస, దాడులు జరుగుతున్నాయి. అన్నిచోట్లా వారికి రక్షణ కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– డి.వందన, యాపలగూడ, కౌటాల

స్వేచ్ఛ ఉండాలి



మహిళలకు కుటుంబంతోపాటు సమాజంలో స్వేచ్ఛ ఉండాలి. స్వేచ్ఛగా చదువుకుని నచ్చిన ఉద్యోగం చేసుకునే అవకాశం ఉండాలి. ఆపదలో ఉన్న వారు ఎవరికీ భయపడకుండా సఖీ కేంద్రాలు, షీటీంలను సంప్రదించాలి.

– ఆర్.మౌనిక, కౌటాల

న్యూస్‌రీల్‌

భక్తి మార్గం అలవర్చుకోవాలి



పూలాజీబాబా చిత్ర పటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

తిర్యాణి(ఆసిఫాబాద్‌): ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామంలోని పూలాజీబాబా ధ్యాన మందిరం 14వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు ఆత్రం భగవంత్‌రావు, నైతం మాధవ్, రాయిసిడాం గోపాల్, వెడ్మ తుకారాం, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు లేని సమాజం లేదు



బహుమతి అందజేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కనే ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్‌: మహిళలు లేకుండా సమాజమే లేదని, ప్రతీ విజయంలో వారి పాత్ర ఉంటుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీసులకు చెస్, క్యారమ్‌తోపాటు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతివలకు సాధ్యం కానిది ఏది లేదన్నారు. అన్నిరంగాల్లో విశేష ప్రతిభ చూపుతూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సత్తా మహిళలకే ఉందన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పురుషులతో పోటీ పడుతూ మహిళలు ఉద్యోగావకాశాలు, విధుల్లో సత్తా చాటడం గొప్ప విషయమన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మహిళలతో కలిసి క్యారమ్ ఆడుతూ ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఏఆర్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

దహెగాం(సిర్పూర్‌): మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉమెన్స్ క్లినిక్‌ల కింద దహెగాం, గిన్నెదరి పీహెచ్‌సీలను గుర్తించామని తెలిపారు. మహిళా దినోత్సవం నుంచి వీటిని ప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది డీఎంహెచ్‌వోను సన్మానించారు. అదనపు డీఎంహెచ్‌వో సీతారాం, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి నేహా, వైద్యాధికారి స్పందన, అధికారులు ఉన్నారు.

రాజకీయాల్లో ఆమె..

- ఉమ్మడి జిల్లాలో రాణిస్తున్న మహిళలు
- ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్లుగా రాణింపు
- స్థానిక సంస్థల్లో సగం పదవుల్లో వారే..
- ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లో ఇంకా వెనుకే..
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాజకీయాలంటే మగ వారికే అనుకునే రోజులు గతం. రాజకీయాలే కాదు.. అన్నింటా అతివలూ సగం అనేది ప్రస్తుతం. రాజకీయ పదవుల్లోనూ మహిళలకు స్థానాలున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో 50శాతం స్థానాలను వారికే రిజర్వ్ చేశారు. చట్ట సభల్లోనూ సముచిత స్థానం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికే కొందరు మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టి తమ ప్రత్యేకతను చాటుతున్నారు. ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా పురుష లీడర్లతో సమానంగా తమ సత్తా చాటుతున్నారు. అయితే ఇంకా ఉమ్మడి జిల్లాలో మహిళా నాయకులు, ప్రజాప్రతినిధుల సంఖ్య మరింత పెరగాల్సి ఉంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఏకైక మహిళా ఎమ్మెల్యే



రేఖానాయక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పది అసెంబ్లీ, రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్సీ పదవుల్లో మగవాళ్లున్నారు. ఒక్క ఖానాపూర్ నియోజకవర్గం నుంచి మాత్రమే అజ్మీరా రేఖానాయక్ మహిళా ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె ఇక్కడి నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి సమర్థవంతంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి చట్టసభలో ఈమె ఒక్కరే ఉన్నారు. ఆసిఫాబాద్ జెడ్పీటీసీగా మొదలైన ఆమె ప్రస్థానం, రాజకీయంగా గెలుపోటములను లెక్కచేయకుండా ప్రస్తుత స్థాయికి చేరుకున్నారు. భర్త శ్యామ్‌నాయక్ ప్రోత్సాహం, తన ప్రతిభతో రాజకీయాల్లో ధైర్యంగా ముందుకు వెళ్తున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్లుగా ముగ్గురు..



కోవ లక్ష్మి



నల్లాల భాగ్యలక్ష్మి



విజయలక్ష్మి

ఉమ్మడి జిల్లాలోని నాలుగు జెడ్పీ స్థానాల్లో మూడింటిలో మహిళలే చైర్‌పర్సన్లుగా ఉన్నారు. తండ్రి మాజీ మంత్రి, కొట్నాక భీమ్‌రావు వారసురాలిగా మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్ సర్పంచ్‌గా మొదలైన ఆమె రాజకీయ ప్రస్తానం ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్ వరకు కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కీలక నాయకురాలిగా ఉన్నారు. తన పెద్ద కూతురు అరుణ సిర్పూర్ (యూ) జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ఇక నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొరిపెల్లి విజయలక్ష్మి కొనసాగుతున్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని భర్త ప్రోత్సాహంతో జిల్లాలో కీలక స్థానంలో కొనసాగుతున్నారు. మంచిర్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నల్లాల భాగ్యలక్ష్మి ఉన్నారు. తన భర్త మాజీ ఎమ్మెల్యే ఓదెలు ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణిస్తున్నారు.

స్థానిక సంస్థల్లోనూ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులుగా అనేక మంది మహిళలు రాణిస్తున్నారు. స్థానిక సంస్థల్లో సగం స్థానాలు మహిళలకే రిజర్వ్ చేశారు. దీంతో మగవారితో సమానంగా వారూ పదవుల్లో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీల్లోనూ మహిళా చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. నాలుగు జిల్లాల్లో 12 మున్సిపాలిటీలు, 66 జెడ్పీటీసీ, 567 ఎంపీటీసీ, 1,508 సర్పంచ్, 12,554 వార్డు స్థానాలున్నాయి. వీటిలో ప్రతీ స్థానిక సంస్థల్లోనూ 50శాతం సీట్లు మహిళలకే రిజర్వ్ చేయడంతో వారు సగం స్థానాల్లో పదవుల్లో ఉన్నారు.

ప్రతిపక్షంలోనూ మహిళా నాయకత్వం



గండ్రత్ సుజాత



కొక్కిరాల సురేఖ

అధికార పక్షంలోనే కాకుండా ప్రతిపక్ష పార్టీలోనూ మహిళా నేతలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కొక్కిరాల సురేఖ కొనసాగుతున్నారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఆదిలాబాద్ జిల్లాలో కీలక నాయకురాలిగా గండ్రత్ సుజాత ఉన్నారు. నిర్మల్ నుంచి గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన స్వర్ణారెడ్డి ప్రజాసేవలో ఉన్నారు. వీరే కాకుండా ఆయా పార్టీలకు మహిళా విభాగాలు, ఇతర పదవుల్లో నాయకత్వం వహిస్తున్నారు. వీరిలో కొందరు మహిళా నాయకులు వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగనున్నారు.

కాగజ్‌నగర్‌లో మహిళల సంబురాలు



కలెక్టర్ హేమంత్ బోర్కడేతో వేడుకలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు



కలర్‌ఫుల్ జోష్!

జిల్లా రంగులు పూసుకుంది.. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగితేలారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ పండుగను సంబురంగా జరుపుకున్నారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మితోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. – వివరాలు 9లో▸



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నివాసం వద్ద వేడుకలు

అడ్డంకులు దాటి.. బడిలో బోధన

జిల్లాలోని చాలా గ్రామాలు అడవుల్లో విసిరేసినట్లు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. నాణ్యమైన విద్య, వైద్యం గిరిజనులకు ఇప్పటికీ అందని ద్రాక్షే.. పల్లెలకు చేరుకోవాలంటే వాగులు, వంకలు దాటి మట్టి రోడ్లపై ప్రయాణం సాగించాల్సిందే. ఇలాంటి కఠిన పరిస్థితులను.. అడ్డంకులను దాటి విద్యాబోధనను బాధ్యతగా తీసుకున్నారు పలువురు మహిళా ఉపాధ్యాయులు. ఒడిదుడుకులకు ఓర్చి ఐదేళ్లుగా రజిత, శిరీష నాటు పడవపై వాగుదాటి పాఠశాలకు చేరుకుంటుండగా, పదేళ్లుగా గ్రామంలోనే ఉంటూ పిల్లలకు ఉచిత బోధనతో వీణ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఐదేళ్లుగా పడవ ప్రయాణం



నాటు పడవపై వాగు దాటుతున్న రజిత, శిరీష



ధనోరా నుంచి బైక్‌పై బడికి వెళ్తున్న టీచర్లు

- వాగు దాటి పాఠశాలలో విధులు
- ఆదర్శంగా నిలుస్తున్న రజిత, శిరీష

కెరమెరి(ఆసిఫాబాద్‌): పిల్లలకు విద్యనందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆ మహిళా టీచర్లు ఇద్దరు వాగులు వంకలు దాటి బడికి చేరుతున్నారు. బస్సు.. బైక్‌పై కొంత దూరం.. వాగు దాటేందుకు పడవ ప్రయాణం.. ఇది వారికి రోజువారీ దినచర్యలా మారింది. దాదాపు ఐదేళ్లుగా వారు ఇందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఇలాగే చేరుకుంటున్నారు. కెరమెరి మండలం ఇందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదేళ్ల క్రితం 50 మంది విద్యార్థులు ఉండేవారు. ఈ పాఠశాలలో ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన రజిత, నార్నూర్ మండలానికి చెందిన శిరీషకు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వేర్వేరుగా అద్దెకు ఉంటున్నారు. జిల్లా కేంద్రం నుంచి కెరమెరి మండలం ఇందాపూర్‌కు ఇప్పటివరకు సరైన రోడ్డు మార్గం లేదు. దనోరా వరకు బస్సు సౌకర్యం ఉండగా, అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఇందాపూర్‌కు వెళ్లాలంటే మధ్యలోని పెద్ద వాగు దాటాల్సి ఉంటుంది.

బస్సు.. బైక్.. పడవ

ఆసిఫాబాద్ నుంచి మొదట టీచర్లు ఇద్దరు దనోరా వరకు బస్సులో వస్తారు. అక్కడి నుంచి సావర్‌ఖేడా గ్రామానికి చెందిన సదూ(పడవ నడిపే వ్యక్తి), శంకర్ వారిని బైక్‌లపై పెద్దవాగు వరకు తీసుకెళ్తారు. ఆ తర్వాత సదూ వీరిని నాటు పడవపై పెద్దవాగు దాటిస్తాడు. అక్కడి నుంచి పాఠశాలకు చేరుకుంటారు. కుమురంభీం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ అధికంగా ఉండటంతో పెద్దవాగులో నిత్యం నీరు నిల్వ ఉంటుంది. ఇక వర్షాలు పడిన సమయంలో వరద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం పొంచి ఉన్నా బాధ్యతతో వెళ్లి పాఠాలు చెబుతున్నామని రజిత, శిరీష తెలిపారు. ఆకాశంలో మబ్బులు పట్టి, వర్షాలు పడే సమయంలో భయంగా ఉన్నా.. విధి నిర్వహణలో అన్ని ఒడిదుడుగులకు ఎదుర్కొవాల్సిందేనని ధైర్యంగా చెబుతున్నారు.

చదువుల తల్లి.. వీణ

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పదేళ్లుగా ఉచిత బోధన

కెరమెరి మండలంలోని సావర్‌ఖేడా ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలకు రాష్ట్రంలోనే మంచి పేరుంది. వినూత్న కార్యక్రమాలు, సులభమైన విద్యాబోధనతో హెచ్‌ఎం కడేర్ల రంగయ్య జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. అదే పాఠశాలలో కడేర్ల రంగయ్య సతీమణి పదేళ్లుగా ఉచిత బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంతో పైసా జీతం తీసుకోకుండా పనిచేస్తోంది. భర్తతోపాటు గ్రామంలో నివాసం ఉంటూ పిల్లలకు మార్గదర్శకం చేస్తోంది. ఇటీవల వీణను సావిత్రీబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు కూడా వరించింది.

విద్యాబోధనపై మక్కువతో..

సావర్‌ఖేడా పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలో కడేర్ల రంగయ్య పదేళ్లగా పనిచేస్తూ బడిని ఉన్నతంగా తీర్చిదిద్దారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న ఆయన 2021లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందారు. గతంలో టీచర్ల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీంతో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా వీణ కూడా పాఠాలు చెప్పడం ప్రారంభించింది. అప్పటి నుంచి నిరాటకంగా బోధనను కొనసాగిస్తోంది. తనకు బోధన అంటే ఇష్టమని అదే నిత్యం బడికి వెళ్లేలా ఉత్సాహాన్ని ఇస్తుందని వీణ తెలిపారు. టీచర్ కావాలని ఆశ ఉన్నా వేతనంపై తనకు పట్టింపు లేదని ఆమె పేర్కొన్నారు.



సావర్‌ఖేడా పాఠశాలలో బోధిస్తున్న వీణ



ఇంతింతై..

- అన్నిరంగాల్లో రాణిస్తున్న మగువలు
- పురుషులతో సమానంగా విధులు

'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్ లిఖిస్తుంది' అని మహాకవి గురజాడ చెప్పిన మాటలను నేటి మహిళలు అక్షర సత్యం చేస్తున్నారు. మనిషి జీవితంతో విడదీయలేని మూడు అక్షరాల బంధం మహిళ. తల్లిగా, చెల్లిగా, భార్యగా భిన్నమైన పాత్రలు పోషిస్తూ అందివచ్చిన అవకాశాలను విజయానికి మెట్లుగా చేసుకుని ప్రగతిపథంలో పయనిస్తోంది. 'ఇంతి'ంతై.. వటుడింతై అన్నట్లు కూలీగా, కార్మికురాలిగా, రైతుగా, ఉద్యోగిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పురుషులకు తీసిపోమని నిరూపిస్తున్నారు. సమానత్వపు అస్తిత్వాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అదృష్టంగా భావిస్తున్నా



శ్రీరాంపూర్:సింగరేణిలో మానాన్న వారసురాలిగా ఉద్యోగం చేయడం అదృష్టంగా భావిస్తున్నా. మా నాన్న ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కారుణ్య నియామకం కింద నాకు ఉద్యోగం వచ్చింది. నేను ఉద్యోగం చేస్తూ అమ్మ, తమ్ముడిని పోషిస్తున్నా. గొప్ప సంస్థలో పనిచేస్తున్నానన్న తృప్తి ఉంది.

– కోదాటి ప్రియాంక, బదిలీ వర్కర్

36 ఏళ్లుగా పనిచేస్తున్నా



శ్రీరాంపూర్: నా భర్త రాజమల్లు ఎస్సార్పీ 1 గనిలో పనిచేస్తూ మృతి చెందాడు. అతని స్థానంలో నాకు ఉద్యోగం వచ్చింది. అప్పట్లో పనులు చాలా కఠినంగా ఉండేవి. అందుకే ఉద్యోగం చేయాలంటే నాకు చాలా భయమేసింది. 36 ఏళ్లుగా సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నా.

– గోమాస లక్ష్మి, జనరల్ మజ్దూర్

ప్రోత్సాహమిస్తే ఏదైనా సాధిస్తారు



శ్రీరాంపూర్:మహిళలకు ప్రోత్సాహం ఇస్తే ఏదైనా సాధిస్తారు. బీటెక్ చదివిన నేను సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరా. పదోన్నతి పొంది సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నా. సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం అందజేస్తోంది. – సోంశెట్టి వేణి, జీఎం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్

కష్టాలను అధిగమించి...



మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన నీరటి బుచ్చయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె రాజేశ్వరి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసింది. తండ్రి కోఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. 2003లో అదే కార్యాలయంలో టైపిస్టుగా చేరింది. జగిత్యాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో రెండేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జరిగిన ప్రమాదంలో భర్త ప్రసాద్ మృతి చెందాడు. తన ఇద్దరు పిల్లలతో పాటు, అత్త, తల్లి బాధ్యతలు చూసుకుంటున్నారు. తనకు అండగా ఎవరూ లేకపోయినా విధులకు న్యాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– రాజేశ్వరి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

భర్త మృతితో బాధ్యతలు



మంచిర్యాలఅగ్రికల్చర్: మాది వ్యవసాయ కుటుంబం. మాకు పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. నాకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు. నా భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి బాధ్యతలన్నీ నాపైనే పడ్డాయి. వ్యవసాయాన్ని నమ్ముకుని సాగుబాట పట్టాను. కష్టపడి ముగ్గురు పిల్లలను చదవించాను. భూమిని నమ్ముకునే జీవిస్తున్నా.– పురంశెట్టి సుశీల, నెన్నెల

కష్టాన్ని మెట్టుగా చేసుకుని..



ఆసిఫాబాద్‌అర్బన్: చిన్నతనంలోనే తండ్రిని ఊహ తెలిసిన తర్వాత తమ్ముడిని కోల్పోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అమ్మ కూలి పనులకు వెళ్లి చదివించింది. దేవాపూర్‌లో పదోతరగతి వరకు చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించా. అందులో చదువు పూర్తి చేసి మిషన్ భగీరథ గ్రిడ్‌లో ఏఈ ఉద్యోగం సాధించా. అనుకున్న లక్ష్యం నెరవేరింది. నేను అనుభవించిన పేదరికం నాకు ఎన్నో అనుభవాలను నేర్పింది. ప్రతీ మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి. – దురిశెట్టి సోని, మిషన్ భగీరథగ్రిడ్ ఏఈ

అటవీ సంరక్షణకుకృషి



ఆసిఫాబాద్‌అర్బన్: నేను ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని అటవీ శాఖలో బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నా. అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నా. విధుల్లో భాగంగా ప్రతిరోజు అడవిలో తిరుగుతుంటాం. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తాం. ఇతర ఉద్యోగాలతో పోలిస్తే అటవీశాఖలో మహిళలకు కొంత ఇబ్బంది ఎదురవుతుంది.

– దైద స్వప్న, అటవీశాఖ బీట్ అధికారి

'శ్రీవారిసేవ'లో గీత



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ముత్యాల గీత హైదరాబాద్‌లోని జీడిమెట్లలో స్కౌట్ శిక్షణ పొందింది. తనతో పాటు మరికొంతమందికి సేవా భాగ్యం కల్పించాలనే ఉద్దేశంతో ‘శ్రీవారి సేవ’ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏటా వందలాది మందికి తిరుపతి వేంకటేశ్వరస్వామికి సేవచేసే అవకాశం కల్పిస్తోంది. ఆసిఫాబాద్ నుంచి బృందాన్ని రైల్లో తిరుమలకు తీసుకెళ్తుండగా ఎనిమిదిరోజుల పాటు క్యాంపులో పాల్గొంటారు. ఏటా నాలుగు పర్యాయాలు తన బృందంతో శ్రీవారి సేవలో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 వేలకు పైగా భక్తులను శ్రీవారిసేవకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

– ముత్యాల గీత, ఆసిఫాబాద్

పురుషులతో సమానంగా..



ఆసిఫాబాద్: పురుషుల కంటే స్త్రీలు తక్కువ కాదు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు పురుషులతో సమానంగా కష్టపడి పనిచేస్తున్నారు. అయినప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు లభించడంలేదు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు చిన్నతనం నుంచే సమాన అవకాశాలు కల్పించాలి. వారు కోరుకున్నంత వరకు చదివించాలి. తమ వృత్తిలో కొనసాగనివ్వాలి.

– చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్, కుమురంభీం ఆసిఫాబాద్

'దురాడి' సంబురం

- కాముడి దహనం వద్ద రాత్రంతా జాగరణ
- సంప్రదాయ పూజలు చేసిన ఆదివాసీలు



పల్లెల్లో బోజర(ధర్మం) అడుగుతున్న గిరిజనులు



గుడాలు సమర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): హోలీ వేడుకల్లో భాగంగా మొదటిరోజు పులారా కార్యక్రమం నిర్వహించిన ఆదివాసీలు మంగళవారం దురాడీ సంబురాలు జరుపుకున్నారు. సోమవారం రాత్రి కాముని దహనం చేసిన చోటే రాత్రంతా జాగరణ చేశారు. అంతా కలిసి ఆడి పాడారు. కామదహనం చేసిన బూడిదను ఎవరూ దొంగలించకుండా రాత్రంతా అక్కడే జాగరణ చేశారు. పురుషులు ఉదయాన్నే నిద్రలేచి ఇంట్లో వండిన గుడాలు, గొడ్డలి, గడ్డపారలతో పొలిమేర వద్దకు వెళ్లి పొదలు కొట్టారు. నైవేద్యపు నీళ్లు చల్లి పూజలు చేశారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం. అనంతరం మళ్లీ కాముడి దహనం వద్దకు వెళ్లి గుడాలు నేవేద్యంగా సమర్పించారు. అక్కడే వాటిని ఆరగించాక బూడిదను తీసుకెళ్లి తమతమ ఇళ్ల ఎదుట ఎదుట చల్లారు. ఇలా చల్లడం వలన దుష్టశక్తులు ఇంట్లోకి ప్రవేశించవని వారి నమ్మకం. దురాడిలో భాగంగా డోలు వాయిస్తూ ‘జాజిరి.. జాజిరి.. జాజిరేయ్’ అంటూ ఇంటింటా తిరుగుతూ బోజర (ధర్మం) అడిగారు. చిన్నాపెద్దా తేడాలేకుండా అంతా కలిసికట్టుగా ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి బోజర అడుక్కున్నారు. అనంతరం సమీపంలోని వాగుల్లో స్నానం చేసి ఇళ్లకు బయలుదేరారు.

తోడేళ్ల దాడిలో ఐదు గొర్రెలు మృతి

తాంసి: తోడేళ్ల దాడిలో ఐదు గొర్రెలు మృతిచెందిన ఘటన భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బుషి రమేష్ యాదవ్ రోజులాగా తన గొర్రెలను సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలోని పాకలో ఉంచాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొట్టంలోని గొర్రెలపై తోడేళ్లు దాడి చేసి ఐదు గొర్రెలను హతమార్చాయి. రైతు రాత్రి సమయంలో గొర్రెలను చూసేందుకు వెళ్లగా అప్పటికే గొర్రెలు మృతిచెంది కనిపించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చేరుకుని తోడేళ్ల దాడిలో మృతిచెందినట్లుగా భావించారు. దీంతో రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పెంబి పీహెచ్‌సీ అద్దాలు ధ్వంసం

- లోబీపీతో స్పృహకోల్పోయిన గర్భిణి
- పెంబి పీహెచ్‌సీకి తీసుకువచ్చిన బంధువులు
- సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం



ధ్వంసమైన కిటికీ అద్దాలు

పెంబి: మండల కేంద్రంలోని ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రం నిర్వహిస్తున్న రాజేశ్ భార్య అనూష గర్భిణి లోబీపీతో మంగళవారం స్పృహ కోల్పోయింది. దీంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి సాయంత్రం 5గంటలకు తీసుకువచ్చారు. పీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహానికి గురైన మహిళ బంధువులు ఆస్పత్రి ఎదుట ఉన్న మరుగుదొడ్డి కిటికిలు ధ్వంసం చేశారు. ఆసుపత్రికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా గిరిజనులే ఉన్నారని, అనారోగ్యానికి గురైనప్పుడు కనీసం ప్రథమ చికిత్స చేసేందుకు కూడా పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, రెగ్యులర్ డాక్టర్ లేక చాలా ఇబ్బందిగా అవుతుందని తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ సుభాష్‌ని వివరణ కోరగా... ఫార్మాసిస్ట్ ఉన్నాడని, కానీ అతడిని పట్టించుకోకుండా ఆందోళన చేసి ఆసుపత్రికి తాళం వేసి అద్దాలు ధ్వంసం చేశారని, వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్‌లో ఆరుగురికి చోటు



బయ్య మొగిలి బి. జగ్గయ్య చల్లూరి అశోక్ రాయిల్ల నర్సయ్య సాగర్‌గౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కౌన్సిల్ సభ్యులుగా బెల్లంపల్లి ఏరియా గోలేటి బ్రాంచి నుంచి ఆరుగురికి చోటు లభించింది. ఇటీవల భూపాలపల్లిలో నిర్వహించిన సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ద్వితీయ మహాసభల్లో కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి తెలిపారు. కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన వారిలో బయ్య మొగిళి, బి.జగ్గయ్య, చల్లూరి అశోక్, గాందర్ల కవిత, రాయిల్ల నర్సయ్య, సాగర్‌గౌడ్ ఉన్నారు. ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కేంద్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కౌన్సిల్ సభ్యులు కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కౌసర్‌నగర్‌కు చెందిన జె.శ్రీనివాస్ (35) ద్విచక్ర వాహనంపై మంచిర్యాల నుంచి కౌసర్‌నగర్‌కు వెళ్తుండగా పులిమడుగు హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సారసాల గ్రామానికి చెందిన చకినాల ఉపేందర్‌పై కత్తితో దాడి చేసిన అదే గ్రామానికి చెందిన చకినాల లచ్చన్నపై మంగళవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. పొలం చుట్టూ కంచె (దడి) విషయంలో ఇరువురి మధ్య తగాదా జరుగుతోంది. ఇదే విషయాన్ని మనసులో పెట్టుకుని ఉపేందర్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. కాగా ఇదే సంఘటనలో చకినాల ఉపేందర్ తన తండ్రి లచ్చన్నను కత్తితో గాయపర్చాడని కుమారుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన పోటీ

- బండరాయి మీదపడి ఒకరు మృతి
- ఆచారంలో భాగంగా నిర్వహించిన పోటీ
- గతంలో ఈ పోటీని రద్దు చేసిన గ్రామస్తులు
- అయినా కొందరు నిర్వహించిన వైనం



కటక్‌వార్ రమేశ్ (ఫైల్)

బోథ్: హోలీ పండుగ రోజు బండరాయి ఎత్తే పోటీని నిర్వహించడం మండలంలోని గుర్రాల తాండ గ్రామంలో ఆచారంగా నిర్వహించేవారు. కొంతకాలం క్రితం ఈ పోటీని గ్రామస్తులు రద్దు చేశారు. అయినప్పటికీ మంగళవారం హోలీ సందర్భంగా పలువురు గ్రామస్తులు నిర్వహించిన బండరాయి ఎత్తే పోటీలో ఓ వ్యక్తి ప్రాణాలు పోయాయి. స్థానికుల వివరాల ప్రకారం... కటక్‌వార్ రమేష్(45)హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. హోలీ పండుగకు సొంత గ్రామమైన గుర్రాలతాండకు వచ్చాడు. హోలీ వేడుకల్లో భాగంగా బండరాయిని ఎత్తే పోటీలో పాల్గొన్నాడు. ప్రమాదవశాత్తు ఆ బండరాయి రమేశ్ ఛాతిపై పడింది. దీంతో నోరు, ముక్కు నుంచి రక్తస్రావం కాగా స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడి భార్య ఐదేళ్ల క్రితమే మృతిచెందగా కూతురు, కుమారుడు ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన తనిష్క్



తనిష్క్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి రేకల తనిష్క్ అంతర్జాతీయ సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. డిసెంబర్ 28 నుంచి 30 వరకు కేరళలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. మే 15 నుంచి 20 వరకు భూటాన్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్, పీడీ తిరుపతి విద్యార్థిని అభినందించారు.

శనగ కుప్ప దగ్ధం



సంఘటన స్థలం వద్ద రైతు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన యాల్ల గంగారెడ్డికి చెందిన చేనులో శనగ కుప్ప సోమవారం రాత్రి కాలిబుడిదైన సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం... పిప్రి గ్రామ సమీపంలో మూడెకరాల్లో శనగ పంట సాగుచేశాడు. పంటను కోసి కుప్పగా పెట్టి సోమవారం సాయంత్రం చేను నుంచి ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం చేసి తిరిగి చేనులోకి వచ్చేసరికి పంటకుప్ప అగ్నికి దగ్ధమై కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉండొచ్చని, దీంతో రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు.

బాలిక అదృశ్యం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.7 (బసంత్‌నగర్) గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైనట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఈ నెల 5న ఉదయం బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన బాలిక సాయంత్రమైనా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.